# ఒకనాడు

"మీ రచనలో మేము ఎలాంటి మార్పు చేయలేదు. ఉన్నదున్నట్లే ప్రచురించాము."

మళ్ళీ ఒక్కసారి మననం చేసుకొన్నాడు పై వాక్యాన్ని తుకారాం. ఇందులో ఏదో గమ్మత్తు వున్నట్లు కన్పించింది అతనికి. ఎంత చక్కని కథ! చదివిన పాఠకుడెంత మతిమరుపు గలవాడైనా జీవితాంతమూ స్మృతి పథంలో చెరగి పోకుండా నిలిచిపోయే కథ.

ఆ కథలోఒక పరిష్కరించలేని సమస్య వున్నది; అపూర్వమైన సంఘటన వున్నది. అది విషాదాంతం. కానీ ఆ చివరి ఒక్క పేరా తీసివేయడంతో దాని రూపమే చెడిపోయింది. రచన పేలవమై పోయింది. ఉద్దేశమే దెబ్బతిన్నది.

తుకారాం జేబీ నుండి ఒక లవంగ మొగ్గ తీసి నోటిలో వేసుకొన్నాడు. నాలుక చెమ్మగిల్లడంతో కొంచెం తాపీగా కూర్చున్నాడు.

"మీ రచనలో మేము ఎలాంటి మార్పు చేయలేదు. ఉన్నదున్నట్లే ప్రచురించాము" మళ్ళీ అదే వాక్యాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. ఉన్నదున్నట్లే ప్రచురించితే ఆ చివరి పేరా ఎలా మారిపోయింది? ఒక్కసారి ఆకాశం వంక చూశాడు. అప్పుడే అస్తమిస్తున్నాడు సూర్యుడు. సంధ్య పట్టు జరీ అంచుల పావడా కట్టుకొన్నది. ఈ సింగారం ఎంతసేపు? గడియ దాటితే కాటుకరంగుల నల్లచీరే గతి! క్రిందికి చూశాడు. రోడ్డు మీద జనం క్యూలో నిలబడ్డారు. ఎవరి ఆతురత వారిది. అయినా ఆయా వేగాలన్నిటినీ వరుస క్రమంలో పెట్టి బంధిస్తున్నది క్రమశిక్షణ.

బిర్రుమని గాలి వీచింది. బల్లమీద పత్రిక రెపరెపమంటూ కొట్టుకొన్నది. అందుకొన్నాడు. "ఒకనాడు" రచన తుకారాం. కథ పేరూ, రచయిత పేరూ మారలేదు. అవసరమైతే కథల పేర్లను మార్చడం సహజమే. కానీ కథ రూపమే చెడిపోయిందెందుకు?

అలా పైపైనే మళ్ళీ ఒక్కసారి చూశాడు. తాను ఉంచిన పాత్రల పేర్లు

కూడా అలాగే ఉన్నాయి.

"అదొక కార్మిక కుటుంబం. ఆ దంపతులిద్దరూ ఒక మిల్లులో పని చేస్తున్నారు. ఆ యువకుని పేరు రఘునాథం. ఆ యువతి పేరు దేవకి. ఇద్దరూ కష్ట జీవులు. వారి నిత్య జీవితంలోని ప్రతి క్షణమూ శ్రమతో కూడుకొన్నదైనా అది సత్యమనే సూత్రానికి కట్టుబడింది.

రఘునాధరావుకు దూరపు బంధువు కూడా ఎవరూ లేరు. దేవకికి తండ్రి మాత్రం వున్నాడు. కానీ అతడు ఒక ఆశ్రమంలో చేరిపోయాడు.

పగలల్లా మిల్లులో పని చేసి రాత్రిపూట గుడిసెకు చేరుకుంటూ వుంటారా దంపతులు. వారి అన్యోన్యత రతీ మన్మధులకు సహితం లేదన్నారు ఇరుగు పొరుగూ.

దేవకికి నెల తప్పింది. ఆరవ మాసంలోనే నిలిచిపొమ్మన్నాడు మిల్లుకు రాకుండా రఘునాథం. మిల్లు యజమాని ఏడవ నెలలో కానీ సెలవు మంజూరు చేయనన్నాడు.

పుట్టబోతున్నది మగబిడ్డే నంటూండేది దేవకివి. కాదు కాదు ఆడబిడ్డే నంటుండేవాడు రఘునాథం. రఘునాధానికి ఆడబిడ్డే పుట్టాలని ఆకాంక్ష వున్నది. అయినా దేవకి కెందుకో మగబిడ్డే కావాలనే కోరిక ప్రబలమై పోయింది. ఈ ఇద్దరి చర్చనూ విన్న ఇరుగు పొరుగు వింతగా నవ్వుకొనే వారు. "ఏం బిడ్డలో లేని వారికి వద్దు వద్దంటున్నా ఇస్తూంటాడు దేవుడు" అనే వారు. వారి మాటల్లో వున్న ఆంతర్యం రఘునాధానికి బాగా తెలుసు. ఎక్కువ ప్రజ్ఞావంతులు మరిలాగే అంటుంటారు. సాహుకార్లు అరవయ్యోయేట బిడ్డలు కంటూ వున్నా వారికి విచిత్రంగా కన్పించదు. సంపద బలిసిన వారింటిలో ఒకేసారి ఒకే నెలలో అత్త, కోడలు మనుమరాలు వరుసగా పురుళ్ళు పోసుకుంటుంటారు. కానీ ఏ కూలివాడి పెండ్లామో తీర్థమాడిందని వింటే "కూలాడికీ మగబిడ్డే" అని విస్తుపోతారు. పేద రైతుకు నలుగురు పిల్లలుంటే కార్మికునికో నలుగురు పిల్లలుంటే "ఈ దేశంలో బర్తు కంట్రోలుండి తీరాలి" అని దేశభక్తిని ప్రదర్శిస్తారు.

ఈ లోకం పోకడ రఘునాధానికి తెలిసే పెళ్ళి చేసుకొన్నాడు. ఎందరు పిల్లలు పుడితేనేం పెంచలేక పోతానా అనేవాడు ధీమాతో. అతడు పైపైకి అనే మాటలు కావవి. అతని హృదయాంతరం నుండి వచ్చిన వాక్కులే.

ఏడవ నెలలో సెలవు పెట్టింది దేవకి. ఎనిమిదో నెలలోనే దేవకి వద్దని

నవ్వుతున్నా రఘునాధం భార్య బాలింతరాలైనపుడు కావలసిన సరంజామానంతా సేకరించి పెట్టాడు. దేనికైనా మంచిదని నలభై రూపాయలు సేవింగ్స్ బ్యాంకులో వేసిపెట్టాడు.

కావలసిన బంధువులే వుంటే దేవకి ఆనందం సరిహద్దులను దాటుకొనేది. ఆమె అందరినీ రఘునాధంలోనే చూచుకొంటూ వుంది. అతడొక్కొక్క సారి తనకు తండ్రి లాంటివాడు. మరొక్కసారి బిడ్డలాంటి వాడు. ఎప్పుడూ భర్తగా వుంటున్నాడు. ఇలాంటివి ఇతరులకు క్రొత్తగా కన్పించినా ఆమెకు మాత్రం అనుభవాలే. ఆమె అన్ని విషయాలూ రఘునాధానికి చెప్పుకుంటుంది బిడ్డలాగ. ఆ విధంగా చెప్పుకొంటున్నపుడు తన తల్లి జ్ఞప్తికి వస్తుంటుంది.

"తొమ్మిదో నెల కూడా పూర్తి అయిపోయింది. రోజూ సాయం కాలం రఘునాధం గబగబా ఇంటికి వస్తున్నాడు. కానీ ఇంకా ఆ గడియ రాలేదు."

ఒకనాడు... అవును... ఈ ఒకనాడు అన్నచోట నుండియే కథ మారి పోయింది. తాను వ్రాసిందలా కాదు.

తుకారాం పత్రికను బల్లమీద పెట్టాడు. అతని దృష్టి పథంలో కోటానుకోట్ల కార్మికులు కన్పించారు. వేలాది మిల్లులు కన్పిస్తున్నాయి. లక్షలాది స్త్రీలు... గర్భవతులు పని చేస్తున్నారు.

ఆ దృశ్యాలను నెమరువేస్తూనే వ్రాశాడు.

ఒకనాడు రఘునాధం మిల్లుకు వెడతాడు. మధ్యాహ్నానికంతా ఆకాశం మేఘావృతమై పోయింది. దిక్కులు ఒక్కసారిగా చీకటిలో మునిగిపోయినవి. ఆ గాలివానలో అతనికి తన భార్య జ్ఞప్తికి వచ్చింది. దేవకి ఒంటరిగా గుడిసెలో ఉంది. ఈ పెనుగాలికి ఆ గుడిసె ఆగదని అతనికి తెలుసు. అతడు తక్షణం మిల్లు నుండి గుడిసెకు పోవాలనుకున్నాడు. మేనేజరును అడిగాడు. అతడు చిరాకుతో అన్నాడు.

"వెళ్ళడానికి వీల్లేదు. అంత పనివుంటే అయిదు నిముషాలు ముందుగా వెళ్ళు."

రఘునాధానికి కోపం వచ్చింది. ఆ ఉద్రేకంలో అతనికి మతి పోయింది. ఆ పళంగా పనిలోకి వెళ్ళాడు. కానీ అతని కళ్ళకు ప్రసవ వేదన పడుతున్న దేవకి కన్పించింది. ఆమె పొలికేకలు విన్పించాయి. అతడు తన్ను తానే మరచాడు. ఎదుటనున్న మరచక్రాన్ని కౌగిలించుకొన్నాడు. ఆ కౌగిలిలో అతడు శాశ్వతంగా

కళ్ళు మూశాడు.

ప్రక్కనున్న కూలీలు అతని శవాన్ని గుడిసెకు మోసుకొని వచ్చారు. ఆ గుడిసె ఎక్కడుందో ఆ వెల్లువల్లో గుర్తు పట్టడం వారికి సాధ్యం కాలేదు. అలా వెదుకుతూ వెడుతున్న వారికి కూలిపోయిన గుడిసె కన్పించింది.

ఎంత గట్టి ప్రాణం! కెవ్వుమంటూ ఏడుస్తూ వుంది అపుడే పుట్టిన పసిగుడ్డు. ఆ గోడకు చేరగిలబడిన దేవకి రఘునాథం శవాన్ని చూడగానే అలాగే ఆగి పోయింది. మళ్ళీ ఆమెలో చలనం లేదు.

ఆ వచ్చిన నలుగురు కూలీలు దిగాలు పడి నిల్చున్నారు. వర్షం ఆగలేదు. వెల్లువలు పొంగుతూనే వున్నాయి. ఆ రెండు భౌతిక దేహాలను గుర్తు పట్టిందేమో పసిపాప. చిన్న కళ్ళు తెరచి చుట్టూ చూస్తోంది. నిశ్శబ్దంగా చూస్తోంది. తన భవిష్యత్తును గురించి ఆలోచిస్తున్నదా? ఏమో."

ఇలా అంత్యమైన చివరి పేరా పూర్తిగా మార్చివేయ బడింది. మేమేమీ మార్చలేదనీ, వున్నదున్నట్లే ప్రచురించామని వుత్తరం వ్రాశారు ప్రచురణ కర్తలు. "ఏమిటీ విచిత్రం! ఇది విషాదాంతమైనా సహజంగానే వుందే! వేలాది గుడిసెలు తుఫానుల్లో కూలిపోవడం కొత్తకాదే! వందలాది కార్మికులు మరచక్రాల్లో నలిగి పోవడం చూస్తూనే వున్నాంగా. ఈ దారుణమైన సంఘటనలలో కల్పితం ఏముంది?" అనుకొని మళ్ళీ ఒక లవంగమొగ్గ నెత్తి నోట్లో వేసుకొన్నాడు తుకారాం.

ఇంతలో అతని భార్య రాధ మేడమీదకు వచ్చి "కాస్సేపు బాబును పట్టుకోండి. పూలు కోసుకోవాలి" అన్నది. తుకారాం బాబును అందుకొంటుంటే ఆమె బల్లమీదనున్న పత్రికను చూచి చేతికందుకొన్నది ఆమె చూపులు వెంటనే ఆ చివరి పేరామీదికే పోయినై.

"ఒకనాడు రఘునాథం మిల్లుకు వెళ్ళగానే కూలీలంతా గుసగుసలు పోవడం చూచాడు. మిల్లుకు ఎక్కువ లాభం వచ్చిందని ఒక్క నెల జీతం బోనస్ క్రింద ఇస్తారని తెలియగానే అతనికి బ్రహ్మానందమై పోయింది. ఏవేవో తియ్యని కలలుకంటూ పని చేస్తుండగానే ప్రొద్దు పోయింది. అనుకొన్నట్టుగా సాయం కాలమే నెలజీతం ముట్టింది. రఘునాథం గబగబా బజారు వైపు పరుగు తీశాడు. చిన్న ఉయ్యాల ఒకటి, బొమ్మలు, పవుడర్ డబ్బీలు, సోపులూ కొనుక్కొని తాను వెళ్ళేలోగా పాప కెవ్వుమంటూ వుంటే ఎంత బాగుండనను కొంటూ

గుడిసె చేరుకొన్నాడు.

ఆశ్చర్యం! అప్పుడే పుట్టిన పాప కెవ్వుమంటోంది. దేవకి సోలిపోయి వున్నా నవ్వుతూ పలకరించింది. "నేచెప్పలేదూ! ఆడపిల్లే..." అన్నాడు ఆనందం పట్టలేక రఘునాథం. దేవకి సన్నగా నవ్వి ముసుగు సవరించుకొంటుంటే అక్కడున్న నర్సు ఆనంద బాష్పాలను రాల్చింది." ఆ పేరాను చదివిందే పత్రికను బల్లమీద పెడుతూ "రైటో, అలా వుండాలి" అన్నది రాధ.

తుకారాం అనుమానంతో ఆమె వంక చూచి "ఎలా వుండాలి?" అన్నాడు.

"అదేం రాతలండి పాడురాతలూ, ఏదో నాలుగణాలిచ్చి కాసేపు ఉబుసు పోతుందని పత్రిక తీస్తే రామ రామ చావులు, సమాధులు. కన్నీళ్ళు, కర్మాంతాలు వ్రాస్తారు. మరి మీరు రాసేదంతా చివరికి చావులేనా?" అన్నది రాధ.

తుకారాం చివాలున లేచి నిలబడి "అందుకు...ఆ ..... ఆ..... అసలు...... రూములో టేబిల్ మీదనే వుంచా నీ కాగితాలు, నీవేమైనా..?" అని అంటుండగానే

"అవునండి... అవును. నేనే మార్చి వ్రాశాను. నాకెవరూ చచ్చిపోవడం ఇష్టం లేదు. అందులోనూ బాలింతలు.... రామ రామా! అదేం కథలండి... అలాంటి వూహలైనా ఎలా వస్తాయండి మీకు?...."

"అయితే మనుషులు చావకుండా చీలలు దించుకొని వుంటారేం?" అన్నాడు తుకారాం.

"చస్తే చస్తారు గానీ ఆనాడే తుఫానూ, వెల్లువలూ. ఇల్లు కూలిపోవడాలు... ఆమెకు నొప్పులు రావడాలు... మొగుడు చావడం ఆమె చావడం ఆ బిడ్డ నెందుకు బ్రతికించారు? దాన్నీ చంపలేకపోయారా?..... ఇదిగోనండి నేనిదే మీకు చెప్పడం ఇట్లాంటి కథలు మాత్రం వ్రాయబోకండేం. కలలో నైనా కష్టాలు కోరుకోరాదంటారు." అంటూ గబగబా మేడదిగి క్రిందికి వెళ్ళింది రాధ.

అమ్మకు కోపం వచ్చిందేం అనుకున్న బాబు బిగ్గరగా ఏడుస్తుంటే వాణ్ని బుజ్జగిస్తూ ఆలోచనలో పడ్డాడు కథకుడు తుకారాం.